ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 8 జనవరి 2024





మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న 'డైట్' కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు

# రంగవల్లుల హరివిల్లు!



అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

## 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు, యువతులు
- రకరకాల ముగ్గులతో వెల్లివిరిసిన తెలుగు సంప్రదాయం
- అనకాపల్లిలో ముందస్తుగానే సంక్రాంతి సందడి



ప్రథమ స్థానంలో నిలిచిన బొదల లక్ష్మికి నగదు బహుమతి, జ్ఞాపికను అందజేస్తున్న దాడి రత్నాకర్ దంపతులు

**అనకాపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** సప్తవర్ణాల రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. రంగురంగుల పూలతో అలంకరించిన ముత్యాల ముగ్గులతో అనకాపల్లి పట్టణానికి వారం రోజులు ముందుగానే సంక్రాంతి పండుగ వచ్చేసింది. 'ఏబీఎస్-ఆంధ్రజ్యోతి' ఆదివారం ఇక్కడ నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు గృహిణులు, యువతుల నుంచి విశేష స్పందన లభించింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్.. కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు..పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు..రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించారు. స్థాని కంగా 'దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్- అటానమస్)' స్పాన్సర్‌గా వ్యవహరించారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల నుంచి మొత్తం 96 మంది మహిళలు, యువతులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి పండుగను ప్రతిబింబించేలా, తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పలు రకాల ముగ్గులు వేశారు. రకరకాల ముగ్గులతో ఎన్టీఆర్ స్టేడియం గ్రామీణ వాతావరణాన్ని తలపించింది. అనంతరం న్యాయనిర్ణేతలు ప్రతీ ముగ్గును నిశితంగా పరిశీలించి, నిబంధనల మేరకు ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతికి అనకాపల్లి గవర పాలేనికి చెందిన బొదల లక్ష్మి (రూ.6 వేలు), ద్వితీయ బహుమతికి అనకాపల్లికి చెందిన సీహెచ్ అన్నపూర్ణ (రూ.4 వేలు), తృతీయ బహుమతికి కశింకోట మండలం బయ్యవరం గ్రామానికి చెందిన కె.యశ్విత (రూ.3 వేలు) ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన 'డైట్' చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు, జీవీఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, భాస్కర్ దంపతుల చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా నీలావతి, పద్మజ వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ చిరుకానుకలు అందజేశారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ, నేటి తరం మహిళలు, యువతులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, సంక్రాంతి పండుగ విశిష్టతను తెలుసుకునే విధంగా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఏటా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

..... మరిన్ని ఫొటోలు, వార్త 7వ పేజీలో



ప్రథమ బహుమతి కి ఎంపికైన ముగ్గు. (ఇన్‌సెట్‌లో) విజేత బొదల లక్ష్మి



ద్వితీయ బహుమతి కి ఎంపికైన ముగ్గు. (ఇన్‌సెట్‌లో) విజేత అన్నపూర్ణ



తృతీయ బహుమతికి ఎంపికైన ముగ్గు. (ఇన్‌సెట్‌లో) విజేత యశ్విత

# మళ్లీ దొడ్డిదారి బదిలీలు

## విశాఖ నగరానికి వచ్చేందుకు తహతహలాడుతున్న టీచర్లు

- రూ.లక్షలు సమర్పించి ఉత్తర్వులు తెచ్చుకుంటున్న వైనం
- కీలక ప్రజాప్రతినిధి సహాయకుడి వసూళ్ల పర్వం
- విశాఖ జిల్లాకు చేరిన బదిలీల జాబితా
- ఖాళీలు లేక విద్యా శాఖ అధికారులు మల్లగుల్లాలు



విశాఖ డీఈవో కార్యాలయం

**విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** పాఠశాల విద్యా శాఖలో మరోసారి దొడ్డిదారి బదిలీలకు తెరలేచింది. ప్రభుత్వంలో పలుకుబడి, దండిగా పైసలుంటే ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ జరిగిపోతుందనే ధీమాతో పలువురు టీచర్లు విశాఖ వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

విశాఖ నగర పరిసరాల్లో ప్రస్తుతం సెకండరీ గ్రేడ్ టీచర్ల ఖాళీలు లేవు. స్కూలు అసిస్టెంట్ పోస్టులు రెండు లేదా మూడు ఉన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యా శాఖ అధికారులు తాజా పరిస్థితిని పాఠశాల విద్యా శాఖకు నివేదించారు. అయినా విశాఖకు రావాలన్న ఆత్రుతతో ఇప్పటికే సుమారు 50 మంది ఉత్తర్వులు తెచ్చుకున్నారని ప్రచారం సాగుతోంది. ఇవి సీల్డ్‌కవర్‌లో జిల్లా విద్యా శాఖకు చేరాయని, డీఈవో వాట్సాప్‌కు కూడా వచ్చాయంటున్నారు. అసలే ఖాళీలు లేని పరిస్థితిలో దొడ్డి దారిన బదిలీ ఆర్డర్లు తెచ్చుకున్న వారిని భర్తీ చేయడానికి అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారని సమాచారం.

### వారికే దిక్కులేదు!

గత ఏడాది జూలై/ఆగస్టులో దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న వారిలో చాలామందికి ఇప్పటికీ పోస్టింగులు లభించలేదు. ప్రస్తుతం అసలు ఖాళీలే లేని స్థితిలో తాజా ఉత్తర్వుల మేరకు భర్తీ ఎలానో తెలియక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఉత్తర్వులు అమలుచేయకుంటే పెద్దల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నెలాఖరులో పదవీ విరమణలు ఉన్నాయి. దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు తెచ్చుకున్న ఉపాధ్యాయులను ఈ ఖాళీల్లో నియమించాలని యోచిస్తున్నారు. ఇదే అదనుగా ఇక్కడి విద్యా శాఖ సిబ్బందిలో కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### సొమ్ము చేసుకుంటున్న సహాయకుడు

అడ్డగోలు బదిలీలకు ప్రభుత్వంలో కీలక ప్రజాప్రతినిధి వద్ద ఓ సహాయకుడు చక్రం తిప్పారనే ప్రచారం జరుగుతోంది. బదిలీ కోసం తన వద్దకు వచ్చే టీచర్ల నుంచి ఇతను భారీగానే డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి. రైల్వే న్యూకాలనీలో ఉంటున్న ఈ వ్యక్తి ఉత్తరాంధ్రలోని విద్యా శాఖ అధికారులతో నిత్యం టచ్‌లో ఉంటున్నారనే ఆరోపణలున్నాయి. గత ఏడాది జూన్‌లో టీచర్ల బదిలీలు ముగిసిన తరువాత జూలై, ఆగస్టులో అడ్డదారి బదిలీల పేరిట భారీగా ప్రభుత్వ ఆర్డర్లు తెచ్చిన ఇతను, టీచర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కాగా గత ఏడాది జూన్‌లో నిర్వహించిన బదిలీల్లో అల్లూరి సీతారామ రాజు జిల్లా నుంచి చాలామంది విశాఖ, అనకాపల్లి చుట్టూ ఉన్న పాఠశాలలకు రాగా, అదే సంఖ్యలో నగరం, మైదానంలో పనిచేస్తున్న టీచర్లు ఏజెన్సీకి వెళ్లారు. మన్యంలో పనిచేయడానికి ఇష్టపడని వారు డబ్బులు వెచ్చించి మరీ మైదానంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో నగర పరిసరాల్లోకి వచ్చిన ఏజెన్సీ టీచర్లలో కొందరు ఇక్కడ ఇమడలేక సొంత మండలాలకు వెళ్లేందుకు నిర్ణయించారు. వారిని గుర్తించి, పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ నుంచి అనుమతి తెచ్చుకుంటున్నారు. ఈ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా విశాఖ పరిసరాల్లోనే పనిచేయాలన్న ఆలోచనతో మరికొందరు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. గత నెలలో గాజువాక, పెందుర్తి మండలాల్లో పనిచేసే ఇద్దరు టీచర్లు పరస్పర బదిలీల పేరిట ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇదే దారిలో మరికొందరు టీచర్లున్నారని, వీరందరికీ కీలక ప్రజా ప్రతినిధి సహాయకుడి నుంచి భరోసా లభించిందనే ప్రచారం సాగుతోంది.

# వీధులన్నీ చెత్తమయం

- పారిశుధ్య కార్మికుల సమ్మెతో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- కుళ్లిపోయి తీవ్రదుర్వాసన.. ప్రజలు అవస్థలు

**అనకాపల్లి టౌన్, జనవరి 7:** మునిసిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో పారిశుధ్యం నానాటికీ క్షీణిస్తున్నది. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాలను రెగ్యులర్ చేయడం, తదితర డిమాండ్లతో కార్మికులు రెండు వారాల నుంచి విధులకు హాజరుకాకపోవడంతో వీధులతోపాటు ప్రధాన రహదారుల్లో కూడా చెత్త పేరుకుపోతున్నది. డ్రైనేజీ కాలువల్లో పూడిక నిండిపోయి మురుగునీరురోడ్లపై ప్రవహిస్తున్నది. తీవ్ర దుర్వాసనతోపాటు దోమలబెడద పెరిగిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో 200 మంది పారిశుధ్య కార్మికులు వుండగా, వీరిలో సగం మంది సమ్మె చేస్తున్నారు. దీంతో రోజువారీ ఉద్భవించే చెత్తలో సగం మాత్రమే తొలగిస్తున్నారు. మిగిలిన చెత్త రహదారుల్లో పేరుకుపోతున్నది. ప్రజారోగ్య విభాగం అధికారులు సైతం ప్రధాన రహదారుల్లోనే పారిశుధ్య పనులు చేయిస్తున్నారు తప్ప వీధుల గురించి పట్టించుకోవడంలేదు. ఇటువంటిచోట్ల మూడు, నాలుగు రోజులకు ఒకసారి చెత్త సేకరిస్తున్నారు. డ్రైనేజీ కాలువను శుభ్రపరచకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు రహదారులపైకి ప్రవహిస్తు న్నది. ఫలితంగా దోమలు, ఈగల బెడద పెరిగిపోయిందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇదిలావుండగా 13 రోజుల నుంచి సమ్మె చేస్తున్న మునిసిల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు నిరసన శిబిరాన్ని కొనసాగిస్తున్నారు.



వేల్పులవీధిలో చెత్తకుప్ప



కూరగాయల మార్కెట్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త



ఉడ్‌పేట బాలాజీదాస్ వీధిలో చెత్త కుప్పలు

### నర్సీపట్నంలో..

**నర్సీపట్నం, జనవరి 7:** మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో నర్సీపట్నంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. అన్ని వార్డుల్లో ఇంటింటా చెత్త సేకరణ నిలిచి పోవడంతో ప్రజలు తడి, పొడి చెత్తను రోడ్లు మీద పారబోస్తున్నారు. రోడ్లన్నీ చెత్తతో నిండి పోయాయి అపారిశుధ్యం తాండవిస్తుంది. రోడ్ల పక్కన డంపర్ బిన్నులు నిండిపోయాయి. ఇందిరా మార్కెట్‌లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నది. మునిసిపల్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.



నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద చెత్తను తొలగించకుండా నిప్పుపెట్టి దహనం చేసిన దృశ్యం

# సీపీఎం సీనియర్ నేత బాలకృష్ణ కన్నుమూత



బాలకృష్ణ (ఫైల్‌ఫొటో)

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సీనియర్ నాయకుడు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ(65) ఆదివారం కన్నుమూశారు. తీవ్రఅనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన తెల్లవారుజామున మృతిచెందినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాల్లో ఉంటూ కడవరకు ఈ ప్రాంత ప్రజల సమస్యలపై పోరాడారని వక్తలు కొనియాడారు. కాగా బాలకృష్ణ ముందుగానే ఇచ్చిన అంగీకార పత్రం మేరకు ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు ఆంధ్ర మెడికల్ కళాశాలకు అందజేశారు. -వివరాలు 7వ పేజీలో

# యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

- పెదముషిడివాడలో చెరువులు, కొండపోరంబోకు భూముల నుంచి తరలింపు
- స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ, గనుల శాఖల అధికారులు



సర్వే నంబరు 398 బచ్చుల చెరువులో మట్టి తవ్వకాలతో ఏర్పడిన గోతులు.

**లంకెలపాలెం, జనవరి 7:** పరవాడ మండలం పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలోని చెరువులు, కొండ పోరంబోకు భూముల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు రెవెన్యూ, గనుల శాఖల అధికారులకు మామూళ్ల ముట్టజెపుతూ యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తరలించుకుపోతున్నారు.

పెదముషిడివాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 398లో బచ్చుల చెరువు, 323లో ఎర్ర చెరువు, సర్వే నంబర్లు 365, 367, 407, 409లో ప్రభుత్వ కొండా పోరంబోకు భూములు వున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ, పరిసర ప్రాంతాల్లో గ్రావెల్‌కు డిమాండ్ ఉంది. దీంతో కొంతమంది వైసీపీ నాయకులు గ్రావెల్ అక్రమ తవ్వకాలకు తెర తీశారు. రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్ తవ్విన లారీలు, డంపర్లతో గాజువాక, అనకాపల్లి, పరవాడ ఫార్మాసిటీ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు, కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

## ఆరు రోజులుగా తల్లి మృతదేహంతోనే....

- మానసిక వ్యాధితో బాధపడుతున్న కుమారుడు
- తల్లి నిద్ర పోతోందని భావించి ఇంట్లో పళ్లు, కూరగాయలతో జీవనం

-వార్త మెయిన్‌లో



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి పోటీల్లో ముగ్గులు వేస్తున్న యువతులు, మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న జడ్జి



రత్నాకర్, అచ్యుత దంపతులను సన్మానిస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధులు

## నూకునాయుడుని పరామర్శించిన గంటా



నూకునాయుడుని పరామర్శిస్తున్న గంటా శ్రీనివాసరావు

**కశింకోట, జనవరి 7 :** చింతలపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకునాయుడును మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. నూకునాయుడు కుడి కాలు తీవ్ర గాయమవడంతో ఆపరేషన్ చేయించుకొని మంచాన ఉన్న ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను గంటా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాస రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కశింకోట సీఐగా వినోద్‌బాబు బాధ్యతల స్వీకారం



**కశింకోట, జనవరి 7 :** స్థానిక పోలీసు స్టేషన్ సీఐగా ఎం. వినోద్ బాబు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సర్కిల్ ఇనస్పెక్టర్‌గా పనిచేశారు. ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు పరిరక్షణకు, జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని చెప్పారు. సంక్రాంతి పండుగలు సమీపిస్తున్నందున కోడి పందేలు, జూదం అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచుతానని తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సత్యానగర్‌లో రక్తదానశిబిరం

**కశింకోట, జనవరి 7 :** మండల కేంద్రంలోని సత్యానగర్ కాలనీ యూత్, మేము సైతం సమాజం కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా 34 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ రక్తాన్ని విశాఖపట్నం విజయ్ బ్లడ్ బ్యాంకుకు పంపించామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## కరాటే పోటీల్లో రేణుకకు బంగారు పతకం



**పరవాడ, జనవరి 7:** న్యూఢిల్లీ ఇండోర్ స్టేడియంలో ఈనెల ఆరు, ఏడు తేదీల్లో నిర్వహించిన జేకేఎస్ సౌత్ ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పరవాడ బీసీ కాలనీకి చెందిన బి. రేణుక సత్తా చాటింది. అండర్ 10 సంవత్సరాల విభాగంలో రాణించి కుమిటిలో బంగారుపతకం సాధించినట్టు కోచ్ కె.మహేష్ తెలిపారు.

## ఉత్సాహంగా బ్రాహ్మణ సంఘం ఆత్మీయ కలయిక

**కొత్తూరు, జనవరి 7 :** సత్యనారాయణపురంలో పరశురామ బ్రాహ్మణ సంఘం ఆత్మీయ కలయిక కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అనకాపల్లి మండలంలోని బ్రాహ్మణ కుటుంబీకులు పాల్గొని రోజంతా ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం వనసమారాధన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు పలు రకాల ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బ్రాహ్మణ సంఘ నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సన్నిధి మణిశర్మ, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నేదునూరి సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు పెర్హూరి భోగ లింగేశ్వర శర్మ, మండల అధ్యక్షుడు జయంతి నాగలింగశాస్త్రి, ప్రాజెక్టు ఇంజనీర్ బి.శేషగిరిరావు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడి చిత్రపటాల పంపిణీ

**సబ్బవరం, జనవరి 8:** మండలంలోని మొగలిపురంలో అయోధ్య రాముడి చిత్రపటాలు, అక్షింతలు ఆదివారం రాత్రి ఊరేగించారు. అర్చకులు చింత చిన్నారావు, సుబ్రహ్మణ్య శర్మ ప్రత్యేక పూజలు అనంతరం చిత్రపటాలు, అక్షింతలు రామనామ స్మరణ చేస్తూ ఇంటింటికీ తిరిగి రామమందిరం చిత్రపటం, అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గండి రవికుమార్, ఉప సర్పంచ్ వాసు మహిళలు పాల్గొన్నారు.

## గ్రావెల్ అక్రమ తవ్వకాలపై జనసేన ఆందోళన



గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఆందోళన చేస్తున్న జనసైనికులు

**లంకెలపాలెం, జనవరి 7:** పెదముషిడివాడ రెవెన్యూ పరిధిలో జరుగుతున్న గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పరవాడ మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఆందోళన చేపట్టారు. అక్రమ తవ్వకాలు చేపట్టిన బచ్చుల చెరువు, కొండా పోరంబోకు భూముల వద్ద జెండాలను పట్టుకొని ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత కరణం నరసింగరావు, జనసేన నేతలు దుల్ల రామునాయుడు, బలిరెడ్డి అప్పారావు, రామగోవింద రావు, సర్పంచులు మోటూరి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాస కాసులు, స్థానిక నాయకులు రమాదేవి, సత్తిరాజు, కనకరాజు, బాలరాజు, తదితులు పాల్గొన్నారు.

## చిన రామ భజన బృందం నగర సంకీర్తన

**అనకాపల్లి టౌన్, జనవరి 7 :** మార్గశిర మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని గవరపాలెం చినరామస్వామి ఆలయ భజన బృందం ఆధ్వర్యంలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అనంతరం చినబోయిగూడెం వీధిలో కోదండరామ లక్ష్మీగణపతి ఆలయంలో భక్తులందరూ ధనుర్మాస భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శ్రీను, బొడ్డేడ రాజు, విల్లూరి పరమేష్, విల్లూరి సురేష్, కాండ్రేగుల నాయుడు, బుద్ధ మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రీచింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**అచ్యుతాపురం రూరల్, జనవరి 7 :** స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం రీచింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మోటూరు త్రినాధ స్వామి, జనసేన నాయకురాలు మోటూరి శ్రీవేణి పాల్గొన్నారు.

# ఎస్మా జీవో ప్రతులను దహనం చేసిన అంగన్‌వాడీలు

**మునగపాక, జనవరి 7 :** ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మునగపాక మెయిన్‌రోడ్డుపై జీవో నంబరు 2 ప్రతులను అంగన్‌వాడీలు ఆదివారం దహనం చేశారు. ఎస్మా గిస్మా జాంతా నై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్మాలు ప్రయోగించి ప్రజల ఆగ్రహావేశాలు చవిచూశారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు బ్రహ్మాజీ, రామలక్ష్మి, జయలక్ష్మి, అంజలి, హేమలతపాల్గొన్నారు.

**రాంబిల్లిలో..** అంగన్‌వాడీల ఆందోళన 27వ రోజు ఆదివారం కొనసాగింది. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ ఇచ్చిన జీవో ప్రతులను తహసీల్దార్ కార్యాలయం ముందు దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దేముడు నాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కనీస వేతనం పెంచి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**కలెక్టరేట్..** అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం బెట్టు వీడి మెట్టు దిగి అంగన్‌వాడీల రాష్ట్ర కమిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేకుంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, గొలుగొండ ప్రాజెక్టుల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**అనకాపల్లి టౌన్..** తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు ఆదివారం కూడా సమ్మెను కొనసాగించారు.

నెహ్రూచౌక్‌లోని బస్టాప్ పక్కన ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలిచ్చారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు తనూజ, ధనలక్ష్మి, కాసులమ్మ, కృష్ణవేణి, ఉమా నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో జీవోను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలు

# వైసీపీ పాలనలో ప్రజలపై మోయలేని భారం

» టీడీపీ నాయకుడు ప్రగడ నాగేశ్వరరావు

**ఎలమంచిలి, జనవరి 7:** రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రజలపై మోయలేని భారం పడిందని, ఇటువంటి ప్రభుత్వాన్ని పంపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వర రావు అన్నారు. ఆదివారం టీడీపీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో విద్యుత్, ఆర్టీసీ, నిత్యావసర వస్తువుల ధరలు, పన్నులతో ప్రజలపై భారం పడిందన్నారు. రాష్ట్రాన్ని సైకో పాలన నుంచి కాపాడుకునేందుకు ప్రజలంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. చంద్రబాబు రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలు రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతగానో దోహదపడతాయన్నారు. విలేకర్ల సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, ఐటీడీపీ ఇన్‌చార్జి రాజాన వెంకునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

# చేనేత కార్మికుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

» రూ.35.2 లక్షల విలువైన పనిముట్లు పంపిణీ

**పాయకరావుపేట, జనవరి 7 :** రాష్ట్రంలో చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఆదివారం పాయకరావుపేట చేనేత కార్మికుల సొసైటీ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం కింద చేనేత కార్మికులకు పనిముట్లును ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు బాబూరావు, జోగులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ పాయకరావుపేటలో ఉన్న 300 మంది చేనేత కార్మికులకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించేందుకు చేనేత సొసైటీని సిల్క్ సొసైటీగా మార్చుచేయాలని జౌళిశాఖ ఆర్‌డీడీకి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిల్క్ సొసైటీగా మార్పు చేసేందుకు కృషిచేయాలని కోరారు. ఎంపీ కె.సత్యవతి మాట్లాడుతూ చేనేత రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై కార్మికులు అవగాహన పెంచుకోవాలన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు మెరుగుపర్చేందుకు తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జౌళి శాఖ ఆర్‌డీడీ ధనుంజయ, ఏడీ మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అభివృద్ధి సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైసీపీ పట్టణ అధ్యక్షులు దగ్గుపల్లి సాయిబాబా పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు పరికరాలను అందజేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు బాబూరావు, జోగులు

# మునిసిపల్ కార్మికులకు జనసేన మద్దతు

**ఎలమంచిలి, జనవరి 7 :** ఎలమంచిలిలో మునిసిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరింది. మునిసిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన నిరసన శిబిరానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను స్థానిక నేతలతో కలిసి కార్మికుల శిబిరానికి వెళ్లి మద్దతు పలికి దీక్షల్లో కూర్చొన్నారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఓ పక్క పారిశుధ్య కార్మికులు, మరోపక్క అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నా సరే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు గుర్రాల శేఖర్, కొఠారు నరేష్, సోమునాయుడు, పల్లా సత్య, మునిసిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు, కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న జనసేన నేత సుందరపు విజయకుమార్

## పడమటమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న రత్నాకర్, అచ్యుత దంపతులు

**కొత్తూరు, జనవరి 7 :** సంపతిపురం పంచాయతీ తమ్మయ్యపేటలో పడమటమ్మ ఆలయ నిర్మాణానికి డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రత్నాకర్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన మాట ప్రకారం ఆలయ నిర్మాణానికి రూ.లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో నంబారు రమణ, స్థలదాత ఇసరపు రమణ, మంగమ్మ, సర్పంచ్ నంబారు నాగమణి, మాజీ సర్పంచ్ నంబారు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## రసరమ్యంగా లాఫింగ్ క్లబ్ కార్యక్రమం

**అనకాపల్లి టౌన్, జనవరి 7 :** స్థానిక వైఎంవీఏ హాల్‌లో ఆదివారం రాత్రి లాఫింగ్ క్లబ్ కార్యక్రమం రస రమ్యంగా సాగింది. అనకాపల్లి లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో అదుర్స్ కామెడీ షో స్థానికులను ఆనందోత్సవాలను నింపింది. అలాగే మ్యాజిక్ షో పులఖండం విజయబాబు ఈల పాట, జోక్స్ హాస్యవల్లరి అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి వాసు, బొడ్డేడ మురళీ, వినకోట బుచ్చిరాజు, రాపేటి నారాయణరావు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

## రామ మందిర ప్రతిష్ఠ రోజున దీపావళి జరిపించండి

**అచ్యుతాపురం రూరల్, జనవరి 7 :** అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠించిన రోజున దీపావళి జరుపుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ ఎలమంచిలి ఖండ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. మండలంలోని ఎం.జగన్నాథపురంలో ఆదివారం అయోధ్య శ్రీరాముని అక్షింతలు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంయోజకులు బీవీ.రమణ పాల్గొన్నారు.

## జనసేనలో వైసీపీ శ్రేణుల చేరిక



జనసేనలో చేరిన మునగపాక వైసీపీ శ్రేణులు

**మునగపాక, జనవరి 7:** వైసీపీ సీనియర్ నాయకులు ఏపీ సత్యనారాయణ తో పాటు కార్యకర్తలు ఆదివారం జనసేన పార్టీలో చేరారు. వీరికి జనసేన కండువాలను ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ సత్యనారాయణ చేరికతో మునగపాకలో పార్టీ మరింత బలోపేతం అయ్యిందన్నారు. సత్యనారాయణను జనసేన పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్టు తెలిపారు. ఈనెలలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని ప్రకటిస్తారని, జనసైనికులు కష్టపడి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ఇన్‌చార్జి జనపరెడ్డి శ్రీనివాస రావు, మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు మొల్లేటి ఆనంద్, పాలిపిని రాము, జిల్లా సహాయ కార్యదర్శి ఆదారి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణావతారంలో పాండురంగడు

**పాయకరావుపేట, జనవరి 7 :** స్థానిక పాండురంగస్వామి దేవస్థానం లో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పాండురంగ స్వామి శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు కృష్ణ స్వామి స్వామివారికి సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం నూతన వస్త్రాలు, పిల్లనగ్రోవి, నెమలి పింఛన్‌తో శ్రీకృష్ణుడుగా అలంకరించారు. ఆలయ ఈవో ఎస్.వెంకటాద్రి, అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శించి పూజలు చేశారు. సాయంత్రం అర్చకులు నారాయణాచార్యులు కృష్ణావతారంపై ప్రవచనాలు, వికాసతరంగిణీ సభ్యులు విష్ణు పారాయణం, సహస్రనామాలు వినిపించారు.

## చలి చంపేస్తోంది..

**నక్కపల్లి, జనవరి 7:** ఏజెన్సీని తలపించే రీతిలో మైదాన ప్రాంతాల్లో చలి పంజా విసురుతోంది. చలి తీవ్రత, మంచు వెన్నులో వణుకుపుట్టిస్తోంది. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకూ చలి ఎక్కువగా వీస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి. చలిగాలిలో తిరుగుతున్న వారు జలుబు బారిన పడుతున్నారు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు లేకుండా బయటకు వెళ్లలేకపోతున్నారు. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా చలి తీవ్రంగా పెరిగిందని ప్రజలు అంటున్నారు. మండలంలో వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. తీర ప్రాంతాల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగా కనబడుతోంది.

## క్రీడా రంగంతో ఉజ్వల భవిత : సీఐ గఫూర్

**ఎలమంచిలి, జనవరి 7 :** విద్యతో పాటు క్రీడాల్లో రాణించినట్టయితే ఉజ్వల భవిత ఉంటుందని ఎలమంచిలి సీఐ ఎస్‌కే.గఫూర్ అన్నారు. ఆదివారం స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో 14వ ఏపీ హాకీ టోర్నీకి జిల్లా హాకీ జట్టు ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ గఫూర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో కోచ్‌ల పర్యవేక్షణలో మెలకువలన్నీ నేర్చుకోవాలన్నారు. అనంతరం జిల్లా జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా హాకీ సంఘం ప్రతినిధులు ఏబీఎల్.రాజు, జి.రాంబాబు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా?

» జనసేన పార్టీ అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్

**ఎలమంచిలి, జనవరి 7 :** రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందని, అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం దారుణమని జనసేన పార్టీ అధికార ప్రతినిధి సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రోజుల తరబడి అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే వారితో చర్చలు జరపకుండా ఎస్మా ప్రయోగించడం దారుణంగా ఉందన్నారు. అదేవిధంగా ఎలమంచిలి నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి లేదన్నారు. నియోజకవర్గంలో కానీ, మునిసిపాలిటీలో కానీ అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమన్నారు. అధికార పార్టీ నేతలు అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సుందరపు ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రంలో ఫ్లై ఓవర్‌ని పూర్తి చేయలేకపోయారని, మునిసిపాలిటీలో సరైన డ్రైనేజీ వ్యవస్థను రూపొందించలేక పోయారన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, జిల్లా కార్యదర్శి కొఠారు నరేష్, నేతలు గుర్రాల శేఖర్, సోమునాయుడు, రామకృష్ణలు పాల్గొన్నారు.

## బుద్ధుడి జీవితంపై కాపారపు పరిశోధనలు

» ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సదస్సులో నివేదిక

**నక్కపల్లి, జనవరి 7:** విశాఖ బుల్లయ్య కళాశాలలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించిన ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సదస్సులో మండలంలోని చందనాడ గ్రామానికి చెందిన డిగ్రీ లెక్చరర్ కాపారపు నాగేశ్వరరావు గౌతమ బుద్ధుని జీవితంపై చేసిన పరిశోధనల గురించి వివరించారు. క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో జన్మించిన గౌతమ బుద్ధుడి జీవిత చరిత్ర తో పాటు ఏపీలో వున్న నాగార్జునకొండ, బొజ్జన్నకొండ, అమరావతి , ప్రసిద్ధ బౌద్ధ స్థావరాల గురించి చేసిన పరిశోధనలను ఆదివారం నాటి సదస్సులో వివరించి నివేదిక సమర్పించారు. ఏపీ హిస్టరీ కాంగ్రెస్ నిర్వాహకులు ఆయనకు ప్రశంసా పత్రాలను ఇచ్చి సత్కరించారు.

## ఎన్టీఆర్ అభిమానుల ఆత్మీయ కలయిక



పీలా గోవిందను సత్కరించిన ఎన్టీఆర్ అభిమానులు

**అనకాపల్లి టౌన్, జనవరి 7 :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు అభిమానుల ఆత్మీయ కలయిక ఆదివారం గవరపాలెం మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హాజరయ్యారు. సీనియర్ ఎన్టీఆర్ అభిమానులు పీలాను సత్కరించారు. అనంతరం అభిమానులు ఒకరినొకరు ఆనందంగా పలకరించుకుని నాటి ఎన్టీఆర్ సినిమాల విడుదలల్లో మరుపురాని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

## 'అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి'

**అనకాపల్లి టౌన్, జనవరి 7 :** రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో 120 అడుగుల ఎత్తుతో నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఈనెల 19న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు తెలిపారు. స్థానిక రింగురోడ్డులోని వైసీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, బొడ్డేడ లక్ష్మీనరసింహం, కొణతాల మురళీకృష్ణ, వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనూరాధ పాల్గొన్నారు.

## దేవవరంలో శ్రీరాముని అక్షింతలు ఊరేగింపు

**నక్కపల్లి, జనవరి 7:** మండలంలోని దేవవరంలో ఆదివారం సర్పంచ్ గొర్ల రాఘవకుమారి,నరసింహమూర్తి ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల ఊరేగింపు అట్టహాసంగా జరిగింది. ముందుగా ఆంజనేయస్వామి మందిరం, రామాలయంలో ఈ అక్షింతలను ఉంచి పూజలు చేశారు. తర్వాత ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవర సత్యనారాయణ, కొరిమి సూర్య గణేశ్, వరహాలు, రామాల శివ నాగేశ్వరరావుపాల్గొన్నారు.

## రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**పరవాడ, జనవరి 7 :** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు డిమాండ్ చేశారు. పెద్ద చెరువు ఆయకట్టు రైతులు చేపడుతున్న నిరసన దీక్ష 29వ రోజు ఆదివారం కొనసాగింది. దీక్షా శిబిరానికి ఆయన చేరుకుని మద్దతు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ తక్షణమే రైతులకు న్యాయం చేయడంతో పాటు రాంకీ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రైతులు రామునాయుడుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ పట్టాభి ప్రసాద్, బీఎంఎస్ నాయకుడు సోమశేఖర్ పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

**పరవాడ, జనవరి 7 :** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ సీనియర్ నాయకులు ఇందల కొండలరావు, నగిరెడ్డి చిన్నారావు తెలిపారు. కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరంలోని 248, 249, 250 బూత్‌ల పరిధిలో ఆదివారం బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి వివరించారు. వచ్చేఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్లి శ్రీనివాస్, నాయుడు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## జగన్ పాలనలో విద్యకు పెద్దపీట : ఎంపీ

**నక్కపల్లి, జనవరి 7:** ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి చెప్పారు. ఆదివారం స్థానిక కేజీబీవీలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రూ.30లక్షలతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణ పనులకు ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, కంబాల జోగులు శంకుస్థాపన చేశారు. కేజీబీవీలో మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని ఇందుకు ఎంపీ నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఎంపీని కోరారు. దీనికి ఆమె సానుకూలంగా స్పందించి, ప్రతిపాదనలు పంపించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంఈవో కె.నరేశ్, కేజీబీవీ ఎస్‌వో షేక్ సలీమా, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా గంగరాజు



**ఎస్.రాయవరం, జనవరి 7:** కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మురుకుర్తి గంగరాజును నియమిస్తూ పీసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు.

## ఘనంగా రుక్మిణి కల్యాణం



రుక్మిణి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

**అనకాపల్లి టౌన్, జనవరి 7 :** స్థానిక గాంధీనగరం అంజయ్యకాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి రుక్మిణి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి అప్పలాచార్యులు (చక్రవర్తి) ఆధ్వర్యంలో 108 మంది యువతీ యువకులచే రుక్మిణి కల్యాణాన్ని అతి వైభవంగా నిర్వహించారు.ఈ కల్యాణం తిలకించడానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీకృష్ణ రుక్మిణి కల్యాణాన్ని తిలకించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

## టెన్త్ విద్యార్థులకు నమూనా పరీక్ష

**ఎలమంచిలి, జనవరి 7:** విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు పదో తరగతి నమూనా పరీక్షను నిర్వహించడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాబీ, ఫణీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఎలమంచిలిలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నాసర్ చే పరీక్ష పేపరు విడుదల చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షల్లో 700 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఫలితాలు అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు సతీష్, చరణ్, భవానీ పాల్గొన్నారు.

## మోకాళ్లపై నిలిచి అంగన్‌వాడీలు నిరసన



చీడికాడలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

**చీడికాడ, జనవరి 7 :** అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మౌనం వీడి చొరవ చూపాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా చీడికాడ చావిడివద్ద మోకాళ్లపై నిలిచి అంగన్‌వాడీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.జానకి, రాజులమ్మ, రామలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**రోలుగుంట :** అంగన్‌వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగించే నిర్ణయం మూర్ఖత్వమని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు బలిజి మహారాజు అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ డిమాండ్లపై సమ్మెచేస్తున్న వారిపై చట్టం ప్రయోగించడం ఏమిటని ప్రశ్నించారు. ఇది జగన్ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. అనంతరం అంగన్‌వాడీలు డిమాండ్లపై నినాదాలు చేశారు.

## దైవ స్వరూపులు స్వామీజీలు : బూడి



భీమిలి వైభవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బూడి, చిత్రంలో స్వామీజీ

**దేవరాపల్లి, జనవరి 7 :** స్వామీజీలు దైవ స్వరూపులని.., సమాజం, ప్రజల శ్రేయస్సు కోరేవారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని కొత్తపెంట దేవానంద సరస్వతి 24వ ఆరాధనోత్సవాలు ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. అన్నసమారాధన అనంతరం భీమిలి వైభవం పుస్తకాన్ని ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. సర్పంచ్ వెంకటరావు, దేముడు, నాగభూషణం, రొంగలి శంకరరావు, చిరికి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న వెంకటరమణ

**దేవరాపల్లి, జనవరి 7 :** పెదగోగాడ సర్పంచ్ పైల వెంకటరమణ ఆర్థిక సహకారంతో సమకూర్చిన గ్రూప్-2 స్టడీ మెటీరియల్‌ను ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదివారం ఇక్కడ పంపిణీ చేశారు. తారువ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బూరే బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## 'పెదగంగవరంలో సమస్యలు పరిష్కరించాలి'



సమస్యలపై నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

**దేవరాపల్లి, జనవరి 7 :** పెదగంగవరంలో నివసిస్తున్న 300 కుటుంబాలవారి తమ సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా వచ్చి పరిశీలించి పరిష్కరించాలని ఆ గ్రామస్థులు ఆదివారం నినాదాలు చేశారు. శ్రీరామ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెండోరోజు సమస్యలపై తమ ఆవేదనను వినిపించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సమస్యలు సృష్టిస్తున్న గిరిజన సంక్షేమశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే రామాలయంలోనే మరణించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేవీ రమణ, అక్కునాయుడు, రామునాయుడు, అప్పారావు, అవతారం, స్వామినాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణావతారంలో పాండురంగడు



**పాయకరావుపేట, జనవరి 7 :** స్థానిక పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పాండురంగ స్వామి శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు కృష్ణస్వామి స్వామివారికి సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం నూతన వస్త్రాలు, పిల్లనగ్రోవి, నెమలి పింఛన్‌తో శ్రీకృష్ణుడుగా అలంకరించారు. ఆలయ ఈవో ఎన్.వెంకటాద్రి, అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శించి పూజలు చేశారు. సాయంత్రం అర్చకులు నారాయణాచార్యులు కృష్ణావతారంపై ప్రవచనాలు, వికాసతరంగిణీ సభ్యులు విష్ణు పారాయణం, సహస్రనామాలు వినిపించారు.

# వామ్మో.. వమ్మలి బడి..!

పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజల్లో విద్యార్థుల ద్వారా చైతన్యం నింపే కార్యక్రమాలు చేపట్టే అధికారులు.. వారు చదివే పాఠశాల ఆవరణలో దుస్థితిపై దృష్టి సారించలేకపోతున్నారు. ఫలితంగా పలుచోట్ల ఓ వైపు దుర్వాసన.. మరో వైపు దోమల బెడదతో అవస్థలు పడుతున్నారు. ఇందుకు ఉదాహరణగా వమ్మలి గ్రామంలోని విద్యాలయాన్నే చెప్పవచ్చు.

- గ్రామంలో జడ్పీ పాఠశాల గేటుముందే మురుగు
- చిన్నపాటి ఊబిని తలపించేలా తిష్ఠ
- ఓ వైపు దుర్వాసన.. మరో వైపు దోమల బెడదతో విద్యార్థులు తీవ్ర అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- అంటువ్యాధుల భయంతో తల్లిదండ్రులు ఆందోళన



వమ్మలి జడ్పీ హైస్కూల్ గేటు వద్ద నిలిచిపోయిన మురుగు

**మాడుగుల రూరల్, జనవరి 7 :** మండలంలోని వమ్మలి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు ఎదుట మురుగు తిష్ఠ వేసింది. ఫలితంగా ఇటు విద్యార్థులు, అటు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు ఆరు నెలల నుంచి ఈ సమస్య ఉన్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. పాఠశాలలోని విద్యార్థులు వినియోగించిన మరుగు దొడ్ల నుంచి వచ్చే వ్యర్థ నీరు పారకుండా ఇక్కడే మురికి కూపంలా నిలిచిపోంది. దీంతో నాచుపట్టి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడద అధికంగా ఉందంటూ విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. పాఠశాల ముందు దుస్థితి ఇంత దారుణంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేకపోవడాన్ని చూసి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 292మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, 14మంది ఉపాధ్యాయ సిబ్బంది పాఠాలను బోధిస్తున్నారు. ఇదిలావుంటే, ఇక్కడికి సమీపంలోనే గ్రామ సచివాలయం ఉంది. అయినప్పటికీ ఈ సమస్య కనిపించకపోవడం దారుణమని అంటున్నారు. ఇక్కడ పూర్తిస్థాయిలో డ్రైనేజీ సదుపాయం కల్పించకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెబుతున్నారు. వర్షాలు పడితే తమ పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుందని విద్యార్థులు వాపోతున్నారు. భారీగా వర్షాలు కురిసేటప్పుడు మురుగు నీరంతా పాఠశాల గేటు ముందుకు చేరి నిలిచిపోతోందని అంటున్నారు. అంటువ్యాధులు విజృంభించకముందే ఉన్నతాధికారులు ఈ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## రాష్ట్ర ప్రగతికి టీడీపీ విజయం తప్పనిసరి

### 'బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'లో చింతకాయల విజయ్



తాడపాలలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

**మాకవరపాలెం, జనవరి 7 :** వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన రాష్ట్రం తిరిగి ప్రగతి పథాన పయనించాలంటే టీడీపీ గెలుపుతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మండలంలోని తాడపాలలో ఆదివారం 'బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని సీఎం జగన్ గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ చెయ్యని పనులకు ప్రతి రోజూ ఏదో ఒకచోట శంకుస్థాపనల పేరిట ఎందుకు కొబ్బరికాయలు కొడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. అనంతరం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆర్వై పాత్రుడు, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, చింతలకాయల రాజేష్, నాయకులు అల్లు రామునాయుడు, శంకరరావు, స్వామి, గోవింద తదితరులు పాల్గొన్నారు.

**నాతవరం :** రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి నుంచే టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. నాతవరంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటైన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనపై అన్నివర్గాల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్నదాతకు ఏడాదికి రూ.20వేలు మహిళలకు నెలకు రూ.1500, ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తారని చెప్పాలన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, మండల తెలుగు యువత అధ్యక్షుడు శెట్టి లోవ, మండల తెలుగురైతు అధ్యక్షుడు పైల సూరిబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇటంశెట్టి సీతారామ్మూర్తి, జీరెడ్డి రాజుబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగ్రు మరిడియ్య, శెట్టి నానాజీ, బంగారు సూరిబాబు పాల్గొన్నారు.

## ఏఎల్‌పురంలో పారిశుధ్య కార్మికులు సమ్మె

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- వేతనాన్ని రూ.18 వేలు చేయాలని డిమాండ్



ఏఎల్‌పురంలో రోడ్డుపై చెత్తకుప్పలు

**కృష్ణాదేవిపేట, జనవరి 7 :** గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో మూడు రోజులుగా పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపడుతున్నారు. ఇందులో భాగంగా విధులను బహిష్కరించారు. దీంతో ఎక్కడిచెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రస్తుతం తమకు ఇస్తున్న రూ.ఆరు వేల వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. చెత్త తొలగించని కారణంగా ఆయా ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కార్మికుల వేతనాల సమస్యను పరిష్కరించి గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

## వేతనం కోసం బస్ స్టేషన్ పారిశుధ్య కార్మికుడు ఎదురుచూపు



వేతనం చెల్లించాలని వేడుకుంటున్న అప్పారావు

**కృష్ణాదేవిపేట, జనవరి 7 :** ఇక్కడి ఆర్టీసీ బస్ స్టేషన్‌లో పనిచేసే పారిశుధ్య కార్మికునికి వేతనం సరిగా చెల్లించడం లేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ జల్లు అప్పారావు అనే వ్యక్తి పారిశుధ్య పనులు చేపడుతుంటాడు. ఇతనికి సహాయంగా భార్య చిట్టెమ్మ కూడా ఈ పనులను నిర్వహిస్తుంటుంది. అప్పారావుకు నెలకు రూ.4,500 చొప్పున చెల్లించేవారు. గత నాలుగు నెలలుగా వేతనం చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు వాపోయాడు. గతంలో కాంట్రాక్టు తీసుకున్నవారు నెలవారీ వేతనం చెల్లించేవారని, ప్రస్తుతం కాంట్రాక్టు ముగిసిందని, అయినప్పటికీ బస్ స్టేషన్‌లో విధులను నిర్వర్తిస్తూనే ఉన్నానన్నాడు. వారం రోజుల్లోగా వేతనం చెల్లించకుంటే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించాడు. దీనిపై నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ధీరజ్‌ను వివరణ కోరగా, బస్ స్టేషన్‌లో రెండు షాపులు టెండరులో పాడినప్పటికీ సదరు టెండరుదారుడు షాపులు పెట్టలేదన్నారు. ఆ రెండు షాపుల ద్వారా వచ్చే ఆదాయం నుంచి పారిశుధ్య కార్మికునికి వేతనం చెల్లించాలని భావించామని తెలిపారు. ఆ పరిస్థితి లేకపోవడంతో ఏదో విధంగా ఆర్టీసీ నిధుల్లో వేతనాన్ని త్వరలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

## 'దివ్యాంగుల సమస్యలపై జగన్ సర్కారు నిర్లక్ష్యం'



దివ్యాంగుల సమావేశంలో మట్లాడుతున్న కాశిబాబు

**బుచ్చెయ్యపేట, జనవరి 7 :** దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తోందని మండల దివ్యాంగుల సంఘం కన్వీనర్ ముమ్మిడిశెట్టి కాశిబాబు ఆరోపించారు. మండలంలోని రాజాంలో గల మరిడిమాంబ ఆలయం ఆవరణలో ఆదివారం జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగుల కార్యాలయాన్ని విజయనగరం తరలించడంతో వారికి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందడంలేదన్నారు. అనకాపల్లి కేంద్రంగా జిల్లాఏడీ కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు, చోడపట్టి శ్రీనువాసులు, సభ్యులు శిరిగిరిశెట్టి మధుసూదన్, ఏలుసూరి పైడిరాజు, అప్పన శ్రీను, దేవర రాజుబాబు, దేవర చిలుకనాయుడు, ముచ్చకర్ల దుర్గాప్రసాద్, యన్నెంశెట్టి నాగప్పారావు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- రైతు గర్జన సభలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు



రైతు గర్జన సభలో మాట్లాడుతున్న పీవీఎస్ఎన్ రాజు

**బుచ్చెయ్యపేట, జనవరి 7 :** రైతులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఆరోపించారు. మండలంలోని గున్నెంపూడిలో ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు గర్జన సభలో మాట్లాడారు.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో సంభవించిన అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల కారణంగా సుమారు పది వేల ఎకరాలకుపైగా పంట నష్టం జరిగిందన్నారు. అయినప్పటికీ జగన్ సర్కారు స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రస్తుతం రబీ సాగుకు పెట్టుబడులు లేక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. బుచ్చెయ్యపేట మండలంలో సాగుకు పెద్దేరు రిజర్వాయర్ నీరున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా సరిగా అందని పరిస్థితి నెలకొందన్నారు. సాక్షాత్తు డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు పెద్దేరు రిజర్వాయర్ ఆధునీకరణకు నిధులు మంజూరయ్యాయని, ఇందులో భాగంగా రిజర్వాయర్ కుడి కాలువను ఆధునీకరిస్తామని చేసిన ప్రకటన కాగితాలకే పరిమితమైందని ఆరోపించారు. అలాగే, గ్రోయిన్లు, చెక్ డ్యామ్‌లు, కాలువలు దెబ్బతినడం వల్ల వేల ఎకరాల ఆయకట్టు దెబ్బతింటుందన్నారు. ఓసీ వర్గానికి చెందిన కౌలు రైతులకు రైతు భరోసా అమలు చేయకపోవడాన్ని ఆక్షేపించారు. ధాన్యం కొనుగోలులో జగన్ సర్కార్ మీనమీషాలు లెక్కిస్తుండడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. వైసీపీ పాలనలో గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి పడకేసిందన్నారు. టీడీపీ, జనసేన సంయుక్త కూటమిని గెలిపిస్తే టన్ను చెరకుకు రూ.3500 అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివదత్, మాజీ ఎమ్మెల్యే, జనసేన పార్టీ జిల్లా రూరల్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, జనసేనికులు, వీర మహిళలు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## కొత్తకోట సీఐగా అప్పలనాయుడు



అప్పలనాయుడు

**రావికమతం, జనవరి 7 :** కొత్తకోట సీఐగా ఎల్.అప్పలనాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా గజపతినగరం సర్కిల్ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై విచ్చేశారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

## పీహెచ్‌సీ పాత భవనంపై కూలిన చెట్టు



పీహెచ్‌సీ పాత భవనంపై కూలిన నీలగిరి చెట్టు

**కృష్ణాదేవిపేట, జనవరి 7 :** గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని పీహెచ్‌సీ పాత భవనంపై ఆదివారం పెద్ద నీలగిరి చెట్టు కూలిపోయింది. దీంతో సదరు భవనం సిమెంటు రేకులు పగిలిపోయాయి. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో పదేళ్ల క్రితం కొత్త భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇందులో సమావేశాలకు సరిపడే భవనం లేదు. ఈ పాత భవనాన్నే అప్పుడప్పుడు సమావేశాలకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనంపై చెట్టు కూలడంతో ఇటు రోగులు, అటు వైద్య సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఇక్కడున్న మిగిలిన చెట్లను తొలగించకుంటే ముున్ముందు ప్రమాదం తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ఎరువుల తయారీ విధానం వివరిస్తున్న నాగేంద్రప్రసాద్

**కృష్ణాదేవిపేట, జనవరి 7 :** ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తిని చూపాలని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ సూచించారు. గింజర్తిలో ప్రకృతి వ్యవసాయంపై జరుగుతున్న శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమై, నాణ్యమైన దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం పలు రకాల ఎరువుల తయారీని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. చోద్యం మాజీ సర్పంచ్ అదపురెడ్డి ప్రభాకరరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## 27వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

**నర్సీపట్నం, జనవరి 7 :** అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా వారు ఇక్కడ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని ఆయన కోరారు.

## 4,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**నర్సీపట్నం, జనవరి 7 :** మునిసిపాలిటీ పరిధి సుబ్బారాయుడుపాలెం శివారులో ఆదివారం 4200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ గణేశ్ తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు నష్టపరిహారం చెల్లింపు

**మాడుగుల రూరల్, జనవరి 6 :** మిచౌంగ్ తుఫాన్ కారణంగా మండలంలో నష్టపోయిన నలుగురు పాడి రైతులకు రూ.53 వేల పరిహారాన్ని అందజేసినట్టు మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రావికమతంలో అయోధ్య అక్షింతలు పంపిణీ



అయోధ్య అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

**రావికమతం, జనవరి 7 :** అయోధ్యలో శ్రీరాముని పూజకు వినియోగించిన అక్షింతలను ఆదివారం రావికమతంలో ఊరేగించారు. అనంతరం వీటిని ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలో బలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అంతా వీటిని శిరస్సుపై వేసుకోవాలని సూచించారు.

## ఎల్ఐసీ ఏజెంట్ల వనసమారాధన

**చోడవరం, జనవరి 7 :** వెంకన్నపాలెంలో ఆదివారం ఎల్ఐసీ బ్రాంచి ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ ఐ.శ్రీనివాసరావు, ఏబీఎం ఎస్.శ్రీనివాసరావు, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకులు ఎం.నాగరాజు, మోహన్, శంకరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## విభేదాలు వీడి విజయానికి కృషి చేయండి : విప్ ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

**చోడవరం, జనవరి 7 :** స్థానికంగా నేతల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి తన విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. మండలంలోని అంబేరుపురంలో మూడు పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లతో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైసీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు డీవీఆర్, చవితిన బాబూరావు, గోవాడ షుగర్స్ గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు కేవీవీఎస్ భాస్కరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బేరా సత్యారావు, మొల్లి ఈశ్వరరావు, సోమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రైతు సంఘం రాష్ట్ర మహాసభలు




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు

**కె.కోటపాడు, జనవరి 7 :** రాజమండ్రిలో సోమవారం నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి రైతు సంఘం మహా సభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు కోరారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. వ్యవసాయం గిట్టు బాటుకాక, రైతులు అప్పుల ఊబిలో చిక్కుకొని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. ఈ మహాసభలో రైతుల సమస్యలను ప్రస్తావించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో గొర్లె.దేముడుబాబు, రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ముత్యాల హరివిల్లు

- విశాఖలో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముగ్గుల పోటీలకు విశేష స్పందన
- భారీగా తరలివచ్చిన నారీమణులు, యువతులు
- విజేతలకు నగదు బహుమతులు ప్రదానం



విశాఖలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూలు ప్రాంగణంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**విశాఖపట్నం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** 'ఆంధ్రజ్యోతి -ఏబీఎన్' ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. టీపీటీ కాలనీలోని శ్రీప్రకాష్ విద్యానికేతన్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ పోటీల్లో నగర పరిధిలోని అనేక ప్రాంతాలకు చెందిన 130 మంది మహిళలు పాల్గొని రంగవల్లులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

సంస్కృతి, సంప్రదాయాలను, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ముగ్గులతో పాఠశాల ప్రాంగణం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది.

**విజేతలు వీరే...**

పోటీల్లో ప్రథమ బహుమతిని పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన ఆర్.ప్రవీణ గెలుచుకున్నారు. రెండో స్థానంలో ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఎ.సంతోషి, మూడో స్థానంలో ఎన్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతానికి చెందిన కె.నాగమణి నిలిచారు. వీరికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అదించారు. అంతేకాకుండా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆకర్షణీయమైన బహుమతులను అందించడం ద్వారా వారిని ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ యాజమాన్యం ప్రోత్సహించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో పోటీలు నిర్వహించారని, ఆసక్తికరంగా పోటీలు సాగాయని పలువురు మహిళలు పేర్కొన్నారు.

కెనరా బ్యాంక్
केनरा बैंक
Canara Bank
A Government of India Undertaking
Together We Can

ఆంధ్రజ్యోతి
ABN

AIMS INSTITUTES
Peenya, Bangalore
AIMS EMPOWERING MINDS
AIMS Admissions Centre +91 81500 01994
www.theaims.ac.in/apply

SWARGASEEMA SUKETANA
Ph: + 91 98490 12500

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు

## 'డైట్' కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్

**అనకాపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి):** తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా రంగవల్లులు నిలుస్తాయని డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్...కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు...పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు...రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహించారు. స్థానికంగా 'దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్- అటానమస్)' స్పాన్సర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ



ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కొత్త తరం వారు కూడా పాత తరం సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునే విధంగా సంక్రాంతికి ముందే ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించిన 'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమాభాస్కర్, అనకాపల్లి ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ వెంకట్, రిపోర్టర్లు వెలగా రమణ, భీమరశెట్టి వెంకటేశ్, మద్దాల రాంబాబు, యాడ్స్, సర్క్యులేషన్ విభాగాల నుంచి జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమమతి ప్రదాన కార్యక్రమంలో మాట్లాడుతున్న డైట్ చైర్మన్ దాడి రత్నాకర్





ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఆర్.ప్రవీణ, సంతోషి, నాగమణికి బహుమతులు అందజేస్తున్న ఆంధ్రజ్యోతి విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు. చిత్రంలో ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్‌వీ రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, ప్రకటనల విభాగం ఇన్‌చార్జి ఆర్.శ్రీనివాస చక్రవర్తి, సర్క్యులేషన్ విభాగం ఇన్‌చార్జి సత్యనారాయణ, ఏబీఎన్ ఇన్‌చార్జి ఆర్‌వై నాయుడు వున్నారు.




పోటీల్లో పాల్గొనేందుకు పేరును నమోదు చేసుకుంటున్న మహిళలు, యువతులు

### ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది

ముగ్గులంటే నాకు ఎంతో ఇష్టం. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' యాజమాన్యం ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి ఏడాది పోటీల్లో పాల్గొంటున్నాను. ఈసారి నాకు ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది.

**- బొదల లక్ష్మి,** ప్రథమ బహుమతి విజేత, గవరపాలెం



ద్వితీయ బహుమతిని అందుకుంటున్న అన్నపూర్ణ

### మూడేళ్లుగా పోటీల్లో పాల్గొంటున్నా..

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో ఈసారి నాకు ద్వితీయ బహుమతి రావడం సంతోషంగా ఉంది. గత మూడేళ్లుగా ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. సంక్రాంతి పండగ సందర్భంగా ముగ్గుల పోటీల ప్రకటన రాగానే ప్రాక్టీస్ చేశాను.

**- చుక్కా అన్నపూర్ణ,** ద్వితీయ బహుమతి విజేత, అనకాపల్లి

### ముందే వచ్చిన పండగ

ముగ్గుల పోటీలు ఎక్కడ నిర్వహించినా తప్పనిసరిగా హాజరవుతుంటాను. పండగ వాతావరణంలో జరిగిన ఈ ముగ్గుల పోటీల్లో నాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఎంతో మంది మహిళలు పాల్గొనడం ఉత్సాహాన్నిచ్చింది. నాకు తృతీయ బహుమతి రావడం ఆనందంగా ఉంది.

**- కె.యశ్విత,** తృతీయ బహుమతి విజేత, బయ్యవరం



తృతీయ బహుమతి అందుకుంటున్న కె.యశ్విత

## క్రైం... crime news

### రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకు తీవ్ర గాయాలు

**బుచ్చెయ్యపేట, జనవరి 7:** భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డులోని వడ్డాది జడ్పీ హైస్కూల్ వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. వి.మాడుగుల మండలం వీరనారాయణం గ్రామానికి చెందిన తలారి జగదీష్ శనివారం రాత్రి బుచ్చెయ్యపేట మండలం పోలేపల్లిలో జరిగిన వేడుకకు హాజరయ్యాడు. ఆదివారం ఉదయం బైక్‌పై బీఎన్ రోడ్డు నుంచి వస్తుండగా, ఎదురుగా గోవాడ షుగర్ ఫ్యాక్టరీ నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలకు గురైన అతనిని 108 వాహనం ద్వారా విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

### 39 మద్యం బాటిళ్లు స్వాధీనం

**పాయకరావుపేట రూరల్, జనవరి 7:** మండలంలోని కేశవరం శివారులో మద్యం విక్రయిస్తున్న దుకాణంపై ఆదివారం పోలీసులు దాడి చేసి 39 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేశవరం శివారులో బి.అరుణకుమార్‌కి చెందిన కిరాణా షాపుపై తమ సిబ్బందితో తనిఖీ చేయగా 39 మద్యం బాటిళ్లు పట్టుబడినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ దాడిలో ఏఎస్ఐ గోవిందరావు పాల్గొన్నారు.

### 15 మద్యం బాటిళ్లు స్వాధీనం

**కశింకోట, జనవరి 7 :** మండలంలోని అచ్చెర్ల గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేశామని అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేయగా.. 15 మద్యం క్వార్టర్ బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

## పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**తుమ్మపాల, జనవరి 7 :** వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల యూనియన్ జనరల్ సెక్రటరీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తుమ్మపాల అన్నపూర్ణ బ్యాంక్ ఆవరణలో జరిగిన యూనియన్ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏపీసీవోబి, డీసీసీబీ, పీఏసీఎస్‌లకు మూడెంచల విధానంలో ఉన్నప్పుడు.. అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా జీతాలు ఒకేలా ఉండాలన్నారు. చాలీచాలని జీతాలతో ఉద్యోగుల కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నాయన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో యూనియన్ జిల్లా సెక్రటరీ శివరామకృష్ణ, ప్రతినిధులు మళ్ల స్వామి, ఆర్. వెంకటరావు, ఈశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

## పందెం కోళ్లకు ట్రయల్ రన్



**ఎలమంచిలి, జనవరి 7:** సంక్రాంతి పండుగ పర్వదినాల్లో నిర్వహించే పందేలకు కోళ్లను సిద్ధం చేస్తున్నారు. కోళ్లకు పోషక విలువలున్న ఆహారాన్ని అందిస్తున్నారు. కోళ్ల ఎలా పోటీల్లో సత్తా నిరూపించుకుంటాయోనని ఇప్పటి నుంచే ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. రానున్న సంక్రాంతి పండుగ రోజుల్లో కోడి పందేలకు ఇప్పట్నుంచే పక్కా ప్రణాళికతో పందెం కోళ్లను పెంచుతున్నారు. వాటి ఆహారపు నియమాలు దగ్గర్నుంచి ఆరోగ్య పరమైన అంశాలు వరకూ స్వయంగా పర్యవేక్షిస్తూ పందెం కోళ్లను కంటిపాపలా రక్షించుకుంటున్నారు.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 70.00 |
| లైవ్ ధర | 90.00 |
| విత్ స్కిన్ | 150.00 |
| స్కిన్ లెస్ | 160.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 625 |
| విజయనగరం | 629 |
| శ్రీకాకుళం | 629 |

# సీపీఎం నేత బాలకృష్ణ కన్నుమూత

**అనకాపల్లి టౌన్, జనవరి 7:** ఉద్యమాల నేత, సీపీఎం సీనియర్ నాయకుడు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ (65) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. గవరపాలెంలోని ఆయన ఇంటి నుంచి పార్థివదేహాన్ని వివేకానందనగర్‌లోని సీపీఎం కార్యాలయం వరకు అంతిమయాత్ర నిర్వహించారు. బాలకృష్ణ సంతాపసభలో టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాల్లో ఉంటూ ప్రజా పోరాటాల్లో 50 ఏళ్లుగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. అలాగే గవరపాలెంలోని బాలకృష్ణ నివాసానికి డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ వెళ్లి బాలకృష్ణ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. బాలకృష్ణ అనేక సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని రత్నాకర్ పేర్కొన్నారు.



బాలకృష్ణ పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న రత్నాకర్

**ఏఎంసీకి బాలకృష్ణ పార్థివదేహం**

అనకాపల్లి పార్థివదేహాన్ని కుటుంబసభ్యులు ఆంధ్రా మెడికల్ కళాశాలకు అప్పగించారు. చనిపోయిన తర్వాత తన శరీరం పరిశోధనలకు ఉపయోగపడాలని ముందుగానే అంగీకారాన్ని ఇచ్చినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా తన భార్య వరలక్ష్మి కుమారుడు కౌశిక్‌ల ఆమోదం మేరకు జ్యోతిబస్ దేహదాన ప్రోత్సాహ సంస్థ ద్వారా ఆంధ్రా మెడికల్ కాలేజి ప్రొఫెసర్ నీరజకు ఆదివారం మధ్యాహ్నం బాలకృష్ణ మృతదేహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కేఎం శ్రీనివాస్, బి. రంగారావు, ఆర్. శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, ఎ. రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహిళా సాధికారత, చెకుముకి పోటీలు

**ఎస్.రాయవరం, జనవరి 7:** మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో మహిళా సాధికారత సంక్రాంతి సంబరాలు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. పీఆర్‌టీయూ నిర్వహించిన ఆడపిల్ల చదువు అవనికే వెలుగు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన జిల్లాస్థాయి డిబేట్ కాంపిటేషన్‌లో రేవుపోలవరం హైస్కూల్ విద్యార్థి సీహెచ్ నాగరాజు మొదటి స్థానంలో నిలవగా, అనకాపల్లి శ్రీచైతన్య విద్యార్థిని మేఘనప్రియ ద్వితీయ స్థానంలోను, పెదగుమ్ములూరు విద్యార్థిని కె. యశస్విని తృతీయ స్థానంలో నిలిచారు. కాలేజ్ లెవెల్‌లో అనకాపల్లికి చెందిన వి. లాశ్యప్రియ మొదటి స్థానంలోను, అడ్డరోడ్డు ఎస్‌వీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ కమల ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరికి బహుమతులను జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి. అప్పారావు అందజేశారు. అలాగే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 20 మండలాల నుంచి 153 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో వి.మాడుగుల, తృతీయ స్థానంలో కొరుప్రోలు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి పాయకరావుపేట, అచ్యుతాపురం, అనకాపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా నిలిచారన్నారు. విజేతలకు జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి రాజారావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, పీఆర్‌టీయూ నేతలు సీతారామరాజు, భద్రరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి చెకుముకి విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు

# ఏం జరిగింది..?

## కృష్ణాపురం కోళ్లఫారం వద్ద యువకుడి మృతి
## మరో యువకుడి పరిస్థితి విషమం
## యజమాని విషం పెట్టి చంపేశాడంటున్న కుటుంబ సభ్యులు

**శృంగవరపుకోట రూరల్, జనవరి 7:** మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో ఉన్న కోళ్లఫారం వద్ద ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో అందులో పనిచేస్తున్న ఇద్దరు యువకులు అపస్మారక స్థితిలో పడిఉన్నారు. ఇది చూసిన కోళ్లఫారం యాజమాని వెంటనే వారిని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సివేరి రవి(21) అనే యువకుడు మృతిచెందగా, మరో యువకుడు సివేరి రామన్న(20) పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం డొంకపుట్ గ్రామానికి చెందిన రవి, సీతంపేటకు చెందిన రామన్న ఎస్.కోటలో చదువుకునేందుకు వచ్చారు. కృష్ణాపురం లోని కోళ్లఫారంలో పార్ట్‌టైం పనికి కుదిరారు. గత పదిహేను రోజులుగా ఇక్కడ పనిచేస్తున్నారు. ఫారం యజమాని శేఖర్ శనివారం రాత్రి 11 గంటలకు ఆ యువకులకు కోళ్లఫారం అప్పగించి సీతంపేటలోని తన ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో శేఖర్ తన ఫారం వద్దకు రాగా రవి, రామన్న అపస్మారక స్థితిలో పడివుండటం చూసి నిర్ఘాంతపోయాడు. వెంటనే తేరుకొని వారిని ఎస్.కోట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి మృతిచెందగా రామన్న కోమాలోకి వెళ్లడంతో వైద్యులు విజయనగరం రిఫర్ చేశారు. అయితే వీరి పక్కన మద్యం సీసాలు ఉన్నాయని, మద్యం తాగడం వలన మృతిచెంది ఉంటారని యజమాని శేఖర్ చెబుతున్నాడు. అయితే మృతుడు రవి తండ్రి, రామన్న కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమ పిల్లలను ఫారం యాజమాని వెట్టిచాకిరీ చేయించి విషపు ఆహారం పెట్టి చంపేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని, రూ.10లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ లోవరాజు మాట్లాడుతూ.. ఈ సంఘటనపై దర్యాప్తు ప్రారంభించామని, పోస్టుమార్టం నివేదిక వచ్చాక వాస్తవాలు తెలుస్తాయన్నారు.



సీవేరి రవి(ఫైల్)



ఆర్.రామన్న (ఫైల్)

## గరుడ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ

**నక్కపల్లి, జనవరి 7:** ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉపమాక క్షేత్రంలో గరుడ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ ఘనంగా జరిగింది. తొలుత కొండపై వున్న స్వామి నిజరూపానికి, కింద ఆలయంలో వున్న క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి అర్చకులు నిత్య పూజలు, హోమాలు చేశారు. అనంతరం ఇత్తడి గరుడ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, రాజాధిరాజ వాహనంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. కార్యక్ర మంలో యువీఎస్ రావు, రంగనాధస్వామి,రేజేటి సింగరాచార్యులు, మీగడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై మాఢవీధుల్లో స్వామివారి ఊరేగింపు

## స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో పలువురి ప్రతిభ

**దేవరాపల్లి/చోడవరం, జనవరి 7 :** స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో మండలంలోని కాశీపురానికి చెందిన నలుగురు అద్భుత ప్రతిభ చూపారు. విశాఖలోని రైల్వే మైదానంలో శని, ఆదివారాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీపురానికి చెందిన నెక్కెళ్ల దేముడు 70 సంవత్సరాల షాట్‌పుట్ విభాగంలో, ఐదు కిలోమీటర్ల నడక, వంద మీటర్ల నడకలో ప్రథమ స్థానాల్లో నిలిచారు. 70 సంవత్సరాల విభాగంలో డి.త్రినాథ్ 1500 మీటర్ల పరుగు, ఐదు కిలోమీటర్ల నడక, హైజంప్‌లో ద్వితీయ స్థానాలను చేజిక్కించుకున్నారు. అలాగే 65 సంవత్సరాల విభాగంలో ఆదిరెడ్డి చినకన్నబాబు షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, ఐదు కిలోమీటర్ల నడకలో ద్వితీయ స్థానం, వంద మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 50 సంవత్సరాల విభాగంలో గడి లక్ష్మి 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, 200 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగులో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులను సొంతం చేసుకున్నారు. విజేతలను అభినందించారు.



విజేతలుగా నిలిచిన కాశీపురం వాసులు

### చోడవరం సబ్ రిజిస్ట్రార్‌కు మూడు పతకాలు

ఇదిలావుంటే, ఈ పోటీల్లో చోడవరం సబ్ రిజిస్ట్రార్ బి.గీతాలక్ష్మి సత్తాచాటి మూడు పతకాలను సాధించారు. 45 ఏళ్ల కేటగిరీలో లాంగ్ జంప్‌లో ప్రథమ, 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, డిస్కస్‌త్రోలో తృతీయస్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.



AJC CLASSIFIEDS

WANTED
★ సువర్ణభూమి సంస్థలో పార్ట్ టైం / ఫుల్ టైం పనిచేయుటకు హౌస్ వైఫ్స్, రిటైర్డ్ పర్సన్స్ కావలెను. మంచి ఇన్సెంటివ్ + కమీషన్ కలదు. కోటీశ్వరులు అవ్వాలనుకునే వారికి మంచి అవకాశం. సంప్ర: 9666282005
AJV_11498

WANTED
★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 20K
ఫోన్: 8977639662, 8977639663 AJH-3515

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి